క్లుప్తంగా

భక్తితోనే మోక్షం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): భగవంతుడి నామ స్మరణతోనే మోక్షం లభిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని హట్కర్ పేట రామలింగ చౌడేశ్వర మందిరం 25వ వార్షికోత్సవం సందర్భంగా చౌడేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

చింతా ప్రభాకర్‌ను కలిసిన కమిషనర్

సంగారెడ్డి: మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ప్రసాద్‌చౌహాన్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అహ్మద్, కౌన్సిలర్లు, నాయకులు నక్కనగరాజ్‌గౌడ్, గోవర్ధన్ నాయక్, విఠల్, శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.

ఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపల్ కమిషనర్‌గా జగ్జీవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన గోపు మల్లారెడ్డి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ కమిషనరుగా బదిలీ అయ్యారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన జగ్జీవన్ బదిలీపై ఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌ను మున్సిపల్ మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

గ్రామకంఠంలో అక్రమ నిర్మాణాలు నిలిపేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): గ్రామకంఠం భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాను నిలిపివేయాలని కోరుతూ మండల పరిధిలోని సాధులనగర్ గ్రామస్తులు ఎంపీడీవో శంకర్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామకంఠం భూమిలో కొందరు దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు ప్రసాద్, రాజు, మల్లేశం, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ఎంపీడీఓగా పనిచేసి రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్తున్న వెంకట్‌రెడ్డిని సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ పాషా, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఎంపీఓ సురేష్, ఏఈ కృష్ణ, ఏపీఓ రంగారావు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న లలిత

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల ప్రజలకు తమ సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న వ్యక్తులకు గుర్తింపు లభించింది. జిన్నారం గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్, గుమ్మడిదల గ్రామానికి చెందిన లలిత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. వారి సేవలను గుర్తించి ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, అడిషనల్ ఏఎస్పీ తేజవత్ రామదాసు, ప్రముఖ నటుడు పృధ్వీరాజ్ చేతులు మీదుగా సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పుల శ్రీనివాస్, లలిత ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శివాజీ జీవితం.. స్ఫూర్తిదాయకం

జిల్లావ్యాప్తంగా మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు ఆయా పార్టీల నాయకులు నివాళులర్పించారు. పలుచోట్ల యువకులు ర్యాలీలు, శోభాయాత్ర నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఖేడ్‌లోని శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ నివాళులర్పించారు.



నారాయణఖేడ్: శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నాయకులు



జహీరాబాద్ టౌన్: శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు, యువకులు



హత్నూర: గుండ్లమాచునూరులో...



జిన్నారంలో...



న్యాల్‌కల్: వడ్డిలో...



సదాశివపేట పట్టణంలో...



కల్హేర్: కృష్ణాపూర్‌లో



వట్‌పల్లిలో...



పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలో...



ఝరాసంగంలో...



రామచంద్రాపురంలో...



మునిపల్లి: కంకోల్‌లో...

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సూర్యతండాకు చెందిన కమ్లి తన కుమారుడు వెంకన్నతో కలిసి జీవనోపాధికి తెల్లాపూర్‌కు వలస వచ్చారు. ఈ నెల 16వ తేదీన బహిర్భుమికి వెళ్లి వస్తుండగా కమ్లికి పాము కరవడంతో కిందపడిపోయింది. అటువైపు వెళ్లిన స్థానికులు గమనించి ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం కమ్లి మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మన ఊరు-మన సంత

సంగారెడ్డి అర్బన్: పట్టణ కేంద్రంలోని మహిళా డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 21న ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ బాయ్ తెలిపారు. విద్యార్థులు తయారుచేసిన ఇన్విటేషన్ కార్డ్స్‌ను సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



ఇన్విటేషన్ కార్డ్స్ చూపుతున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు



ఆర్డీఓ రాజును సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆర్డీఓ రాజు బాధ్యతల స్వీకరణ

జహీరాబాద్: జహీరాబాద్ ఆర్డీఓగా రాజు బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన వెంకారెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజు నియమితులయ్యారు.

నేడు ఐఐటీహెచ్‌కు గవర్నర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ మంగళవారం హైదరాబాద్ ఐఐటీకి రానున్నారు. ఇక్కడ నిర్మించిన క్యాంపస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తోపాటు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా హాజరవుతారని ఐఐటీ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

ఎమ్మెల్యేకు సన్మానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావును క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి

సంక్షేమం, అభివృద్ధికి కృషి

- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో 229 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం నర్సాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాలు, తండాల అభివృద్ధితో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్డీఓ వెంకటేష్, నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, వినోద్‌పటేల్, గుండెరావు, కిషన్‌నాయక్ రాథోడ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయండి

గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రణాళికాబద్ధంగా బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ పథకాల ద్వారా నిధులు కేటాయించిందని, ఈ నిధులతో మౌలిక వసతులను కల్పిస్తామని వివరించారు. సమావేశంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

భూ బాధితులకు పరిహారం చెల్లించండి

నారాయణఖేడ్: నిజాంపేట్-నారాయణఖేడ్-బీదర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమెల మాణిక్ అన్నారు. భూ బాధితులకు పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు మూడింతల పరిహారం లేదా భూమికి బదులు భూమి, ఇళ్లు కోల్పోతున్నవారికి వేరేచోట ఇంటిస్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని తెలిపారు.



సంగారెడ్డి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజరాబేరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం వట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిలు, సీఆర్‌పీ గోపిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వట్‌పల్లి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. అనుమతి లేకున్నా పై తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో బంజార బేరి సంఘం నాయకులు సుభాష్‌నాయక్, మోహన్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమల నివారణకు చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలలో దోమల నివారణకు సోమవారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దశలవారీగా అన్ని కాలనీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఏఈ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

మునిపల్లి(అందోల్): వేసవి సమీపిస్తున్నందునా ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ అంజలిదేవి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలోని బుదేరా, కంకోల్ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. అంతకుముందు నర్సరీలు, శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నల్లాపైపులకు మోటార్లు ఏర్పాటు చేసి నీళ్లు తీసుకునేవారికి రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

క్రీడా సామగ్రికి సాయం

మునిపల్లి(అందోల్): క్రీడాసామగ్రి నిమిత్తం మండల పరిధిలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు రేగోటి నరేష్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి రూ.15 వేల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్, సుధాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేష్, మోడల్ స్కూల్ పీఈటీ మన్సూర్, కంకోల్ ప్రైమరీ స్కూల్, పెద్దగోపులారం స్కూల్, ఖమ్మంపల్లి స్కూల్, సెలెస్టిక స్కూల్ ఆఫ్ ఎక్సటెషన్స్, మునిపల్లి జిల్లా పరిషత్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి: జిల్లాలో కల్లు గీతకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ నాయకులు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమార్‌గౌడ్ కృష్ణగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అంజన్నగౌడ్ చెన్నగౌడ్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ పుస్తెమట్టెలు బహూకరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువతికి మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలు, చీరను సోమవారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు చరణ్‌కుమార్, యాదగిరి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయరావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయరావు బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ రాజా మహమ్మద్ కోదాడకు బదిలీ అయ్యారు.

◆ తహసీల్దార్‌గా జుబేర్ అహ్మద్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ తహసీల్దార్‌గా జుబేర్ అహ్మద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బాలశంకర్ కోహిర్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. నిజాంపేట తహసీల్దార్ రాజగణేష్‌ను కల్హేర్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. రాజగణేష్‌ను తప్పించి కంగ్టి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జుబేర్ అహ్మద్‌కు కల్హేర్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జుబేర్ అహ్మద్‌ను ఆర్ఐ మల్లేశం, సర్వేయర్ సునీత, సిబ్బంది నరేష్, రవి, సాయి, డేవిడ్, రాజు, ఆనంద్ సన్మానించారు.

◆ ప్రాథమిక పాఠశాల తనిఖీ

సదాశివపేట(సంగారెడ్డి: పట్టణ పరిధిలోని లోపలికోట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అంజయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయురాలు వందన, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పుల్‌కల్ తహసీల్దార్‌గా కృష్ణ

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ తహసీల్దార్‌గా కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సరూర్‌నగర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాదవరెడ్డి, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

◆ బీజేపీ బలోపేతానికి కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్మకూర్ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ విజ్ఞప్తిని గౌరవించి పీవీకి భారతరత్న ఇచ్చిన కేంద్రానికి భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ధన్యవాదాలు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలుగుజాతికి కీర్తి, ప్రతిష్టలను తెచ్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం గర్వకారణమన్నారు.

◆ ప్రణాళికతో చదవాలి

సంగారెడ్డి అర్బన్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికతో సన్నద్ధం కావాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు సోమనాథ్ అన్నారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ప్రహరీ పనులు ప్రారంభం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బాచేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ.23 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ పనులు కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. యువజన కాంగ్రెస్ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు దుర్గారెడ్డి, ప్రవీన్‌గౌడ్, సుదర్శన్, సంగయ్య, చరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ, మాజీ సర్పంచ్‌లు చిట్ల సత్యనారాయణ, నవీన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

◆ హనుమాన్ ఆలయంలో పూజలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గంజివెనుక శివ పంచముఖి హనుమాన్ మందిరంలో ద్వాదశ జ్యోతిర్లింగ పూజను గురుస్వామి రచన్నస్వామి ఆధ్వర్యంలో శివపార్వతి పూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తులకు ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యను విదేశాల్లో అభ్యసించేందుకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి దేవుజా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి మార్చి 20వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ ఇంజనీరింగ్‌లో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయుటకు డాక్టరేట్ ఫీజులో 60 శాతం మార్కులు సాధించి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.